# నేడు జమ్మికుంటకు 'హరీశ్‌రావు'


జమ్మికుంటలోని తెలంగాణ చౌక్

- హైదరాబాద్ నుంచి హెలీకాప్టర్‌లో పట్టణానికి రాక
- 50వేల మందితో ఘన స్వాగతం పలుకనున్న 'పాడి'
- మధ్యాహ్నం తెలంగాణ చౌక్‌లో రోడ్ షోలో పాల్గొననున్న అమాత్యుడు
- హుజూరాబాద్ అభ్యర్థి కౌశిక్‌రెడ్డికి మద్దతుగా ప్రచారం

జమ్మికుంట, నవంబర్ 9: రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు శుక్రవారం జమ్మికుంటకు రానున్నారు. హైదరాబాద్ నుంచి నేరుగా జమ్మికుంట పట్టణానికి హెలీకాప్టర్‌లో చేరుకుంటారు. నాయిని చెరువు వద్దగల హెలీప్యాడ్‌లో దిగనున్నారు. మంత్రి హరీశ్‌రావుకు బీఆర్‌ఎస్ హుజూరాబాద్ నియోజకవర్గ అభ్యర్థి, మండలి విప్ పాడి కౌశిక్‌రెడ్డి 50వేల మందితో అపూర్వ స్వాగతం పలికేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు. అందుకు అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు భారీ ఏర్పాటు చేస్తున్నారు. కౌశిక్‌రెడ్డితో పాటు.. నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ మంత్రి పెద్దిరెడ్డితో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, ప్రజలతో కలిసి 'ప్రజా ఆశీర్వాద ర్యాలీ' రోడ్ షోలో హరీశ్‌రావు పాల్గొననున్నారు. రోడ్ షో స్థానిక తెలంగాణ చౌక్ వరకు సాగనుంది. అనంతరం అమాత్యుడు తెలంగాణ చౌక్ వద్ద ప్రజలనుద్దేశించి ప్రసంగించనున్నారు. తర్వాత పాడి కౌశిక్‌రెడ్డికి మద్దతుగా ప్రచారం చేయనున్నారు.

### స్వచ్ఛందంగా తరలిరానున్న ప్రజలు

మంత్రి హరీశ్‌రావు జమ్మికుంటకు రానున్న నేపథ్యంలో నియోజకవర్గంలోని బీఆర్‌ఎస్ శ్రేణులు, ప్రజలు భారీ ఎత్తున స్వచ్ఛందంగా తరలిరానున్నారు. ముఖ్యంగా యువత ద్విచక్ర వాహనాలపై నేటి ఉదయం పట్టణానికి చేరుకోనున్నారు. హుజూరాబాద్ సిటీ సెంట్రల్ హాల్ నుంచి, ఇల్లందకుంట మండల కేంద్రంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం నుంచి, వీణవంక, కమలాపూర్ మండల కేంద్రాల నుంచి, అలాగే జమ్మికుంట పట్టణం.. మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన శ్రేణులు, యువత ఎవరికి వారే జమ్మికుంటకు రానున్నారు. మంత్రి హరీశ్‌రావుకు ఘన స్వాగతం పలుకనున్నారు. ప్రజా ఆశీర్వాద ర్యాలీలో పాల్గొననున్నారు. అమాత్యుడి రోడ్‌షోకు కనీవిని ఎరుగని తరహాలో ఏర్పాట్లు సాగుతున్నాయి.

### బీఆర్‌ఎస్ అభ్యర్థి 'పాడి' నామినేషన్

బీఆర్‌ఎస్ హుజూరాబాద్ నియోజకవర్గ అభ్యర్థి, మండలి విప్ పాడి కౌశిక్‌రెడ్డి శుక్రవారం హుజూరాబాద్‌లో నామినేషన్ వేయనున్నారు. ఉదయం హైదరాబాద్ నుంచి నామినేషన్ వేసేందుకు వచ్చే సమయంలో పాడి కౌశిక్‌రెడ్డి తల్లిదండ్రులు పాడి శైలజ-సాయినాథ్‌రెడ్డి ఆశీర్వాదం తీసుకోనున్నారు. సతీమణి శాలినీరెడ్డి మంగళహారతి పట్టనున్నారు. నేరుగా హుజూరాబాద్‌కు చేరుకుంటారు. మధ్యాహ్నం 12గంటల తర్వాత స్థానిక నాయకులు కొందరితో కలిసి సాదాసీదాగా నామినేషన్ సెట్లను వేయనున్నారు. నామినేషన్ ఘట్టం పూర్తైన వెంటనే అక్కడికి చేరుకున్న బీఆర్‌ఎస్ శ్రేణులు, ప్రజలతో కలిసి ద్విచక్ర వాహనంపై జమ్మికుంటకు చేరుకుంటారు. మంత్రి హరీశ్‌రావుతో కలిసి 'ప్రజా ఆశీర్వాద ర్యాలీ' రోడ్ షో పాల్గొంటారు.

### హరీశన్నతో అనుబంధం

అమాత్యుడు హరీశన్నతో ఇక్కడి బీఆర్‌ఎస్ శ్రేణులు, ప్రజలకు గతంలో అనుబంధం ఉంది. గత ఉప ఎన్నికల్లో హరీశ్‌రావు ఇక్కడ ఇన్‌చార్జిగా పనిచేశారు. ఇక్కడి ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, ప్రజలను గుర్తుకు పెట్టుకుని పేరు పెట్టి పిలిచే చనువు ఉంది. అప్పటి ఉప ఎన్నికల సమయంలో అన్ని వర్గాలను సమన్వయం చేశారు. సమ్మేళనాలు నిర్వహించారు. నేరుగా మాట్లాడిన సందర్భాలు ఉన్నాయి. ఇప్పటికి కూడా సదరు శ్రేణులు, ప్రజలతో సత్సంబంధాలు కొనసాగిస్తున్నారు. ఇక మరోసారి అసెంబ్లీ ఎన్నికల సమయంలో జమ్మికుంటకు వస్తున్నారని, రోడ్ షోలో పాల్గొననున్నారని సమాచారం తెలుసుకున్న సబ్బండ వర్గాలు తరలివస్తున్నాయి.

## పార్టీ శ్రేణులు తరలిరావాలి

### బీఆర్‌ఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బండ శ్రీనివాస్


మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బండ శ్రీనివాస్

హుజూరాబాద్‌టౌన్, నవంబర్ 9: హుజూరాబాద్ నియోజకవర్గానికి శుక్రవారం రాష్ట్ర మంత్రి తన్నీరు హరీశ్‌రావు వస్తున్నందున బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి బండ శ్రీనివాస్ పిలుపునిచ్చారు. గురువారం ఆయన పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ముందుగా కేసీ క్యాంపులోని ఆర్‌వో కేంద్రంలో బీఆర్‌ఎస్ అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డి నామినేషన్ కార్యక్రమానికి హాజరవుతారని, అనంతరం జమ్మికుంట గాంధీచౌక్‌లో కార్నర్ మీటింగ్(సభ)లో మంత్రి పాల్గొంటారని తెలిపారు. సమావేశంలో బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు సంగెం ఐలయ్య, సింగిల్ విండో అధ్యక్షుడు ఎడవెల్లి కొండల్‌రెడ్డి, రైతుబంధు సమితి మండలాధ్యక్షుడు దాసరి రమణారెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కన్నెబోయిన శ్రీనివాస్‌యాదవ్, బీఆర్‌ఎస్ ఎస్సీ సెల్ మండలాధ్యక్షుడు మొలుగూరి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## 'రోడ్ షో'ను విజయవంతం చేయాలి

### విలేకరుల సమావేశంలో బీఆర్‌ఎస్ నాయకులు

జమ్మికుంట, నవంబర్ 9: రాష్ట్ర మంత్రి తన్నీరు హరీశ్‌రావు నేడు జమ్మికుంటలో పాల్గొనే రోడ్ షోకు రోడ్ షోకు అన్ని వర్గాలు హాజరై విజయవంతం చేయాలని మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపెల్లి రాజేశ్వర్‌రావు, డీసీసీబీ వైస్ చైర్మన్ పింగిళి రమేశ్, పీఏసీఎస్ చైర్మన్ పొనగంటి సంపత్, బీఆర్‌ఎస్ అర్బన్ పార్టీ అధ్యక్షుడు టంగుటూరి రాజ్‌కుమార్ పిలుపునిచ్చారు. గురువారం పట్టణంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. కొద్ది రోజుల్లోనే సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ ప్రోగ్రామ్స్ కూడా ఉంటాయని చెప్పారు. అభ్యర్థి కౌశిక్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించుకుని, కేసీఆర్‌కు గిఫ్టునిద్దామని పేర్కొన్నారు. సమావేశంలో కౌన్సిలర్లు నరేశ్, రమేశ్, రాజ్‌కుమార్, నాయకులు మనోహర్‌రావు, తిరుపతిరావు, నవీన్‌కుమార్, రమేశ్, శ్రీనివాస్, మాణిక్యం, కుమార్, విద్యార్థి నాయకులు ఆవుల తిరుపతి యాదవ్, ఆలేటి శ్రీరాం, తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

## అక్రమంగా మద్యం తరలిస్తే చర్యలు

జమ్మికుంట, నవంబర్ 9: అక్రమంగా మద్యం తరలిస్తే ఎన్నికల నిబంధనల ప్రకారం చర్యలు తప్పవని ఎక్సైజ్ జమ్మికుంట సర్కిల్ సీఐ ఎండీ అక్బర్ హుస్సేన్ హెచ్చరించారు. గురువారం సాయంత్రం జమ్మికుంట పట్టణం నుంచి మండలంలోని మాచినపల్లి గ్రామానికి వెళ్లే దారిలో వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాచినపల్లికి చెందిన కుమ్మరి వెంకన్న అక్రమంగా మద్యం తరలిస్తున్నట్లు గుర్తించారు. అతడి వద్ద 3.6లీటర్ల మద్యం స్వాధీనం చేసుకొని, టీవీఎస్ స్టార్ సిటీ వాహనాన్ని సీజ్ చేసి, కేసు నమోదు చేసినట్లు సీఐ చెప్పారు. ఎన్నికల నిబంధనలు ప్రతి ఒక్కరూ పాటించాలని సూచించారు. ఇక్కడ ఎస్‌ఐలు రమాదేవి, కబీర్ దాస్, హెడ్ కానిస్టేబుల్ అయిలయ్య, కానిస్టేబుల్స్ పెద్దన్న, మహేశ్, పద్మావతి, శైలజ ఉన్నారు.

### వీణవంకలో ఒకరిపై కేసు..

వీణవంక, నవంబర్ 9: మండల కేంద్రం నుంచి అక్రమంగా మద్యం తరలిస్తున్న మానకొండూర్ మండలం ఊటూరుకు చెందిన మోతె రవిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ఆసిఫ్ తెలిపారు. గురువారం అతడి నుంచి రూ.11 వేల విలువైన మద్యాన్ని స్వాధీనం చేసుకొని సీజ్ చేసినట్లు చెప్పారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున గతంలో వివిధ కేసుల్లో ఉన్న ఎనిమిది మందిని తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు తెలిపారు.


మైనార్టీ సంక్షేమ పథకాల బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డి, ముస్లిం మైనార్టీ నాయకులు

## బీఆర్‌ఎస్‌కు అండగా నిలువాలి

- కారుగుర్తుకు ఓటేసి భారీ మెజార్టీతో గెలిపించాలి
- మైనార్టీ సంక్షేమ పథకాల కరపత్రం ఆవిష్కరణలో పార్టీ అభ్యర్థి 'పాడి'

హుజూరాబాద్‌టౌన్, నవంబర్ 9: దేశంలో ఎక్కడా లేని సంక్షేమ పథకాలతో ముస్లింల అభ్యున్నతికి పాటుపడుతున్న బీఆర్‌ఎస్‌కు మైనార్టీలు అండగా నిలువాలని, ఎన్నికల్లో కారుగుర్తుకు ఓటేసి భారీ మెజార్టీతో గెలిపించాలని పార్టీ హుజూరాబాద్ అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. తెలంగాణలో మైనార్టీల సంక్షేమం కోసం అమలు చేస్తున్న పథకాలతో రూపొందించిన కరపత్రాన్ని గురువారం స్థానిక సిటీ సెంటర్‌లోని పార్టీ కార్యాలయంలో మైనార్టీ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, స్వాతంత్రం వచ్చినప్పటి నుంచి ప్రత్యేక రాష్ట్రం ఏర్పడే వరకు మైనార్టీల సంక్షేమం కోసం ఏ ప్రభుత్వం బీఆర్‌ఎస్ సర్కారులా పాటుపడలేదన్నారు. సామాన్యుడి కోసం కేసీఆర్ సంకల్పించి అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారన్నారు. ముస్లింలకు షాదీ ముబారక్, మైనార్టీ విద్యాలయాలు, మైనార్టీ బంధు, షాదీఖానల నిర్మాణం, ఇమామ్, మౌజాన్లకు ప్రతినెలా జీతాలు, రంజాన్ తోఫా, ఇఫ్తార్ విందు, మసీద్, కబ్రస్థాన్ ఆధునీకరణ, మహిళలకు కుట్టు మిషన్లు, విద్యార్థినులకు ఫ్రీ బస్సు పాస్, వితంతువులు, బీడీ కార్మికులకు పెన్షన్, కేసీఆర్ కిట్, రూ.ఐదు కోట్లతో అజ్మీర్ దర్గా దగ్గర భవనం, డబుల్ బెడ్రూం ఇండ్లు, ఇలా అనేక రకాల సంక్షేమ పథకాలను ముస్లిం మైనార్టీలకు కేసీఆర్ అందించారని వివరించారు. అన్ని విధాలా అండగా ఉండే బీఆర్‌ఎస్ పార్టీని కారు గుర్తుపై ఓటేసి గెలిపించాలని కౌశిక్‌రెడ్డి ముస్లింలకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మాజీ కోఆప్షన్ సభ్యుడు మహ్మద్ ఇమ్రాన్, మైనార్టీ సీనియర్ నాయకుడు మహమ్మద్ అంజదుల్లా ఖాన్, నాయకులు ఎంఏ ముజీబ్, మహమ్మద్ ఖలీద్, మహమ్మద్ సాబీర్, మీర్ ముజాఫర్ అలీ, ఫజల్ ఊర్ రహమాన్ పాల్గొన్నారు.

## నిశ్చితార్థ వేడుకకు హాజరైన మండలి విప్


హనుమకొండలో నిశ్చితార్థ వేడుకలో మండలి విప్ పాడి కౌశిక్‌రెడ్డి తదితరులు

వీణవంక, నవంబర్ 9: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ మావురపు విజయభాస్కర్‌రెడ్డి-గీత దంపతుల కూతురు డా.నారాయణిరెడ్డి నిశ్చితార్థం డా. అభినంద్ రెడ్డితో గురువారం హనుమకొండలో జరుగగా, ముఖ్య అతిథిగా మండలి విప్, ఎమ్మెల్సీ, బీఆర్‌ఎస్ హుజూరాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డి మండల ప్రజాప్రతినిధులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా డా.నారాయణిరెడ్డి-డా.అభినంద్‌రెడ్డిని మండలి విప్ పాడి కౌశిక్‌రెడ్డి ఆశీర్వదించారు. కార్యక్రమంలో ఎంపీపీ ముసిపట్ల రేణుక-తిరుపతిరెడ్డి, జడ్పీటీసీ మాడ వనమాల-సాధవరెడ్డి, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు ఎక్కటి రఘుపాల్‌రెడ్డి, సింగిల్‌విండో మాజీ చైర్మన్ గంగాడి తిరుపతిరెడ్డి, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, సింగిల్‌విండో డైరెక్టర్లు, బీఆర్‌ఎస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ హిత దీపావళిపై అవగాహన


ఓటు హక్కు వినియోగంపై ప్రతిజ్ఞ చేస్తున్న మహిళలు

హుజూరాబాద్‌టౌన్, నవంబర్ 9: హుజూరాబాద్ మున్సిపల్ కార్యాలయం ఆవరణలో మెప్మా ఆధ్వర్యంలో గురువారం మహిళలు, ప్రజలకు పర్యావరణ హితంగా దీపావళిని జరుపుకోవడంపై అవగాహన కల్పించారు. దీపావళి పండుగ సందర్భంగా పటాకులు కాల్చడం వల్ల పర్యావరణానికి కలిగే నష్టాలను వివరించారు. పటాకులు కాల్చడం వల్ల వచ్చే పొగ ద్వారా పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుందని, శ్వాసకోస వ్యాధులు సంక్రమిస్తాయని మున్సిపల్ కమిషనర్ సల్వాది సమ్మయ్య పేర్కొన్నారు. అనంతరం మహిళలకు మట్టి ప్రమిదలను పంపిణీ చేశారు. అలాగే ఈ నెల 30న జరుగబోయే శాసనసభ ఎన్నికల్లో అర్హులందరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. ఈ మేరకు ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ కే రామ్మోహన్ రాయ్, మెప్మా సీఎల్‌ఆర్పీలు తిప్పబత్తిని రమాదేవి, కరుమండ్ల స్వరూప, పట్టణ ప్రజలు, మెప్మా సభ్యులు పాల్గొన్నారు.